విడిప్రతి 40 పైసలు

శుక్రవారం 28-6-74

**కౌసా +**

చెండామందు సేవించండి, ఆయాసము వెంటనే నివారణయగును. కళ్ళెప్రీగా తెగిపోయి హాయిగా నుండును. 'ఇసినోఫీలియా'కు చాలామంచిది. వ్యాధిని శాశ్వతముగా నివారించి శరీరమునకు బలముకలిగించు అత్యుత్తమ ఔషధము వెల: 200 మి లి రు. 4-75

ఏ. యస్. ఫార్మా

రాయాజీవీధి - నెల్లూరు

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు

సంపుటి 46 సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి సంచిక 26

**అతివలకు శుభవార్త!**

మీకు శ్రమలేకుండా, రుచికరంగా, శ్రేష్ఠంగా ఆనంద్ ఆవకాయ మామిడి, నిమ్మ ఊరగాయలు తయారుచేస్తున్నాము.

**ఆనంద్ పికెల్ ఇండస్ట్రీస్**

కాపువీధి :: నెల్లూరు.

## 'శాసనాల జాడలు! జాలిజార్చు గోడలు!!'



పెట్రోలు లేదనే ప్రభుత్వ శాసనానికి బలైన పేదలవాడ–నెల్లూరు కోటమిట్ట ప్రాంతం. 20 తేది అగ్నిప్రమాద భయానక, హృదయ విదారక దృశ్యం. కళకళలాడే పేట కలనాటి బూడిదయింది. ఇక మిగిలింది – మొండిగోడలు, మండేగుండెలు, పూలులేని కాడలు, ఆ నిర్భాగ్యుల గుండె ఆర్పలేని నిప్పుకన్నీళ్ళు!

# ఇండిపెండెంట్ల ప్రవేశం అంచెలుగానే!

ఏమైతేనేం శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల తతంగం చరమఘట్టంలో పడింది. ఉభయ శాసనసభల సమావేశాలు ప్రారంభమైనాయి.

ముఖ్యమంత్రి వెంగళరావు కార్యశూరుడనిపించుకున్నాడు. అసెంబ్లీనుండి శాసనమండలికి ఎన్నుకోవల్సిన అధికార కాంగ్రెసు అభ్యర్థులను ఎనిమిది నుండి తొమ్మిదికి దర్జాగా పెంచేశాడు.

### కాంగ్రెస్‌కు నూరుపాళ్ల విజయం!

కాంగ్రెస్‌కు - ముఖ్యమంత్రి వెంగళరావుకు – కౌన్సిల్ ఎన్నికలలో నూటికి నూరుపాళ్ళ విజయం లభించింది.

కాంగ్రెస్ అధికారికంగా పోటీ చేసిన 8 స్థానాలు; కాంగ్రెస్ బలపరచిన రోశయ్య, కమ్యూనిస్టు అభ్యర్థికూడా గెలిచారు.

గవర్నరు నామినేషన్లు ఈనలుగురికి లభించాయి: ప్రగడ కోటయ్య, శ్రీమతి రోడా మిస్త్రీ, అమర్‌సింగ్ రథోడ్, ఎ. రహమాన్‌ఖాన్. ఇవి కూడా ఢిల్లీ ఆదేశం మేరకే జరిగినట్లుంది.

కమ్యూనిస్టు అభ్యర్థికి అధికారికంగా ఓట్లు ఇచ్చి గెలిపిస్తామన్న వాగ్దానం ప్రకారం అసలు పదిమందిని గెలిపించే బాధ్యత ముఖ్యమంత్రిదే అయింది అన్నమాట.

కాని తొమ్మిదో సీటుకు ఎవరిమట్టుకు వాళ్ళకే ఆశవుండి అయిదుగురు కాంగ్రెసు వాదులు నామినేషనులు వేశారు. నామినేషన్లు వేసినవారిలో మాజీ మంత్రులు నారపరెడ్డి, వాసుదేవరావుకూడ వున్నారు. మనుష్యులను పదవుల ఆశ ఆ విధంగా బాధిస్తుంది. చిట్టచివరకు, ఏమైతేనేం ముఖ్యమంత్రి సలహా ననుసరించి అందరూ ఉపసంహరించుకున్నారు; చివరికి బ్రహ్మానందరెడ్డిగారి హయాంలో కాంగ్రెసు గోత్రికుడుగా మారిన శాసనమండలి సభ్యుడు శ్రీ రోశయ్యను తొమ్మిదవ అధికార కాంగ్రెసు అభ్యర్థిగా ప్రకటించారు.

మొత్తంమీద ఐదుగురు అభ్యర్థులు మిగిలారు. ఇందులో ఇద్దరు పాత్రికేయులు కూడా ఉన్నారు. ఉబలాటపడుతున్నాయీ అభ్యర్థులకు ప్రతిపాదకులయినా ఓట్లువేస్తారా అనే సంశయం చాలామందికి ఉంది–రాజ్యసభ ఎన్నికలలో జరిగినట్లు, కొందరు జూన్ 27 లోగా తెల్లబెండా ఎత్తినా ఆశ్చర్యపడనక్కరలేదు.

పదిమంది మొదటిలెక్కలోనే ఎన్నికవుతారని గట్టిగాచెప్పడం కష్టం. ఎందుకంటే ప్రతిఒక్కరికి 26 మొదటి ఓట్లు రావాలి. కొందరు అతిప్రధానులు అనుకొనేవారికి ఎక్కువ ఓట్లు కేటాయించడం జరిగింది. అయిదుగురు ఇండిపెండెంటు సభ్యులు ఓట్లకోసం ఏ మంత్రం వేస్తారో ఎవరికీ తెలియదు. బహిరంగంగా అర్థబలం, అంగబలం వారిలో ఏ ఒక్కరికీలేదు.

అందుకని ఎన్నికల ఫలితాలు వెంగళరావు కార్యదక్షతకు ఇంకొక నిదర్శనం కాగలదని రాజకీయనాయకుల అంచనా. ఈ వారం పత్రిక చదువరుల చేతుల్లోకి వచ్చేసరికి ఫలితాలుకూడా వచ్చేస్తాయి; జోస్యం చెప్పనవసరంలేదు. ముఖ్యమంత్రి తొమ్మిదో అభ్యర్థినికూడా ప్రతిపక్షాలనుండి రేపు కాంగ్రెసుపార్టీలో చేర్చుకోబోయేవారి అభిప్రాయాలను కనుక్కొనే నిర్ణయించేశారు. అయినా ప్రతిపక్షాలలో ప్రతి ఒక్కరి అభిప్రాయం నిర్ధారణ చేయడం సాధ్యంకానివిషయం. క్రమశిక్షణకు అలవాటుపడిన పార్టీల సభ్యులలోనే పార్టీనిర్ణయాలు ధిక్కరించడం కొత్తకాదు. ఎవరిమట్టుకు వాళ్ళ ఎన్నికయి వచ్చినవారు ఎంతవరకు కలిసివుంటారు అనేప్రశ్నకు సమాధానం ఫలితాలే చెప్పాలి.

కాని ఇండిపెండెంటుగా నామినేషన్లు వేసిన అభ్యర్థులకు మాత్రం ఆశవుంది. వారి కలలే నిజమయిన నాడు స్థానిక నాయకుల అభిప్రాయాలకు విలువ నివ్వడం అవసరమని కేంద్రనాయకులు గుర్తించగలరు. నేడున్న పరిస్థితుల్లో ఇటు బ్రహ్మానందరెడ్డి వర్గం, అటు పి. వి. వర్గంకూడా తిరుగుబాటు చేయడానికి సిద్ధంగాలేవు–ప్రధానమంత్రికి వర్గాలు బలపడటం అనేది ఇష్టమయినదికాదు. ముఖ్యంగా బ్రహ్మానందరెడ్డి వర్గం కేంద్రనాయకుల చేతిలో తిన్న దెబ్బలో పి. వి. అనుచరులు ఆనిర్ణయాలకు కట్టుబడి వుండటానికే నిర్ణయించుకున్నారు. మరి బ్రహ్మానందరెడ్డి వర్గం తోక రూపాడిస్తే అసలు మూలవిరాట్టుకే ముప్పు వస్తుందని వారికి భయం. అందుకే ఎన్నికల్లో ఎక్కువ తక్కువలు జరిగినా పదిమంది అధికార అభ్యర్థులు గెలవడం ఖాయం అని రాజకీయ వర్గాల భావన. దానికి అన్యథా జరిగితే కేంద్రనాయకులు దానిని చాలా తీవ్రంగా పరిగణించక తప్పదన్నమాట.

అంటే ముఖ్యమంత్రి కాంగ్రెసు ముద్ర ధారణ చేయడానికి సిద్ధంగావున్న ఇండిపెండెంటు సభ్యుల పార్టీప్రవేశ మహోత్సవం వెనుకపడుతుంది. ఈ ఎన్నికల్లో, రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో వారి ధోరణి

**మా హైదరాబాదు విలేఖరి**

పార్టీప్రవేశానికి అర్హత కల్గిస్తుంది. అందుచేత ఇంతలో వారి పార్టీప్రవేశం జరిగే సూచనలులేవు. అయినాకూడా అంచెలవారీగా, తరతమభేదాలతో ప్రవేశం జరుగుతుంది– సామూహికంగా కాదు.

ఈనెలాఖరుకు ఎన్నికయే క్రొత్త శాసనమండలి సభ్యులు 26 మందిలోనూ 19 మంది సిద్ధమవుతారు. ఇందులో కాంగ్రెసు వారు 18 మంది అవుతారన్నమాట. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుండి ఏడుగురు జూలై మూడవవారానికి ఎన్నికవుతారు. వారిలో వీలయినన్ని స్థానాలలో నెగ్గాలని ప్రచ్ఛన్నంగా జనసంఘ్ పోటీచేస్తోంది. ఎన్నికయినతర్వాత వారు తమ నిజస్వరూపంలో బయటపడతారు. ఎన్నికలవరకూ వారు ఇండిపెండెంటు అభ్యర్థులుమాత్రమే. బుద్ధిజీవులకు తామే ప్రతినిధులమంటారు.

నానాటికీ హెచ్చుతున్న పదవుల మోజుకు శాసనమండలి ఎన్నికలతతంగం ఒకలక్షణంమాత్రమే. ఇక్కడితో యీకార్యక్రమం ముగుస్తుందికనుక రాజకీయవాదులకు రెండేళ్ల విశ్రాంతి.

—

**జమీన్ రైతు**

**ప్రకటనలు గురువారంలోగా చేరాలి!**

ప్రకటనలు (Advertisements) శుక్రవారంకూడా వస్తున్నందువల్ల చాల ఇబ్బంది కల్గుతున్నది. ఆఖరునిమిషంలో స్థలం వుండకపోవడం, వేయలేకపోవడం జరుగుతున్నది. ప్రకటనదార్లు తమ ప్రకటనలను గురువారంలోగా పంపవలసిందిగా కోరుతున్నాము.

ఆ తర్వాత చేరేవాటి ప్రకటన నమ్మకంలేదు.

—మేనేజరు, జ. రై.



ఇది నశిస్తున్న ఒక ప్రాంతం–నిశ్వసిస్తున్న శ్మశానం! బంగారిది మండుతుంటే నిస్సహాయంగా పొగలో వణుకుతున్నారు!

